

బీజేపీ నేత మొవ్వ సత్యనారాయణను
బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి కేటీఆర్

శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు మొవ్వ సత్యనారాయణ ఆదివారం ఎమ్మెల్యే గాంధీ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రగతి భవన్‌లో మొవ్వతో పాటు ఆయన అనుచరులకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గులాబీ జెండా మరోసారి రెపరెపలాడాలని మంత్రి కేటీఆర్ ఆకాంక్షించినట్లు ఎమ్మెల్యే గాంధీ తెలిపారు. అనంతరం గాంధీ మాట్లాడుతూ మొవ్వ రాకతో నియోజకవర్గంలో పార్టీకి మరింత బలం పెరిగినట్లయిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించుకుంటామని ఈ సందర్భంగా సత్యనారాయణ పేర్కొన్నారు. కాగా, మొవ్వ సత్యనారాయణ వెంట పార్టీలో చేరిన వారిలో బీజేపీ, టీడీపీ నేతలు డీఎస్ఆర్‌కే ప్రసాద్, లీలా ప్రసాద్, తన్నీరు ప్రసాద్,రెడ్డి ప్రసాద్, గిరి, ప్రశాంత్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మియాపూర్, నవంబర్ 19



వక్ఫ్‌బోర్డు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చూపిస్తున్న చొరవ, మంత్రి మల్లారెడ్డి చిత్తశుద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు బోడుప్పల్ 14వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కంభం కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మంత్రి మల్లారెడ్డి మేయర్లు సామల బుచ్చిరెడ్డి, జక్కు వెంకట్‌రెడ్డి సమక్షంలో కిరణ్‌కుమార్‌రెడ్డి గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ... కిరణ్‌కుమార్‌రెడ్డి బీజేపీకి రాజీనామా చేసి అనుచరులతో బీఆర్ఎస్‌లో చేరడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు చందర్‌గౌడ్, పద్మారెడ్డి, సీసా వెంకటేశ్, సుమన్‌నాయక్, కోఆప్షన్ సభ్యులు బ్రహ్మన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు. *- బోడుప్పల్, నవంబర్ 19*




బీఆర్ఎస్ అభిమాని తయారు చేసిన కారు గుర్తు కలిగిన
స్కూటర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్

## దేవాసి సమాజ్ ప్రజల అభ్యున్నతికి పాటు పడుతా


**గోషామహల్ బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్**



అబిడ్స్, నవంబర్ 19: గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే దేవాసి సమాజ్ ప్రజల అభ్యున్నతికి పాటు పడుతానని నందకిశోర్ వ్యాస్ హామీ ఇచ్చారు. సీతారాంబాగ్ ద్రౌపది గార్డెన్స్‌లో దేవాసి సమాజ్ వారు నిర్వహించిన దీపావళి సమ్మేళనం కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చేసి గోషామహల్ నియోజకవర్గంలో నివాసముంటున్న వారికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తోందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని వర్గాల అభ్యున్నతికి పాటు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, ఆనంద్‌కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌కు ఓటేస్తే కష్టాలే

**ఎన్నికల ప్రచారంలో మంత్రి సబితా ఇంద్రారెడ్డి**



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, నవంబర్ 19: ఆడ బిడ్డను ఆశీర్వదించి.. అభివృద్ధికి పట్టం కట్టాలని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మామిడిపల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీ పరిధిలోని దేవేందర్‌నగర్, జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని పహడీషరీఫ్‌లో ఆదివారం రోడ్ షో నిర్వహించగా, అపూర్వ స్పందన లభించింది. అడుగు అడుగునా ప్రజలు మంత్రికి నీరాజనాలు పలికారు. మంగళ హారతులు పట్టి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తామన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కరోనా కష్టకాలంలో కనిపించని నాయకులు ఓట్ల కోసం వస్తే ప్రజలు ఎవరూ ఆదరించరన్నారు. ముఖం తెలియని నాయకులు ఓట్ల కోసం ప్రజల దగ్గర గ్యారడీ చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. అలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే కరెంటు కష్టాలు తప్పవన్నారు. మూడు గంటల కరెంటు సరిపోతుందని చెబుతున్నారన్నారు. మాయగాల మాటలను ప్రజలు నమ్మకూడదన్నారు. బీజేపీకి ఓట్లు వేస్తే మతకల్లోలాలు సృష్టిస్తారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణ ప్రజలకు చేసింది ఏమిలేదన్నారు. ప్రజల పైన పన్నుల భారం మోపిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను పెంచి ప్రజల పై మోయలేని భారం మోపారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ రైతు వ్యతిరేక పార్టీలన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో అభివృద్ధి చేశామని, ఓట్లు అడిగే అర్హత బీఆర్ఎస్ పార్టీకే ఉందన్నారు. తుక్కుగూడ ఐటీ కారిడార్‌గా మారబోతున్నదన్నారు. వేలాది మంది యువతకు ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో40 కోట్లతో 11 చెరువులను సుందరీకరణ చేసినట్లు పేర్కొన్నారు. 13 బస్తీ దవాఖానలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. కార్పొరేటర్లు యాతం పవన్ కుమార్, శివ కుమార్, బీఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడు నరేందర్ గౌడ్ పాల్గొన్నారు.

## హ్యాట్రిక్ విజయం ఖాయం

**రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్**

అత్తాపూర్, నవంబర్ 19: బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయాన్ని సాధించబోతున్నదని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ఆదివారం ఎంపీ రంజిత్‌రెడ్డితో కలిసి అత్తాపూర్ డివిజన్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను ప్రజలకు వివరించి..కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారన్నారు. అంతకుముందు ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్..సిక్‌చౌనీ గురుద్వార్ మందిరాన్ని దర్శించుకొని ప్రార్థనల్లో పాల్గొన్నారు.

## ప్రజల భద్రతకు బీఆర్ఎస్ భరోసా

**మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి**



మహిళా నేతలకు అభివాదం చేస్తున్న
మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 19: ప్రజల భద్రతకు బీఆర్ఎస్ పార్టీతోనే భరోసా ఉంటుందని మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మచ్చబొల్లారం, అల్వాల్, నేరేడ్‌మెట్, మల్కాజిగిరి, మౌలాలి డివిజన్‌లలో పాదయాత్ర చేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ భరోసా ఇస్తుందన్నారు. మహిళల భద్రత కోసం షీటీమ్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు మహిళా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. గ్రేటర్ మున్సిపల్ ఎన్నికల్లో మహిళలకు 50 శాతం కార్పొరేటర్ల సీట్లను కేటాయించినట్లు చెప్పారు. మల్కాజిగిరి నియోజకవర్గంలో అందరికీ పూర్తి భరోసా ఇస్తున్నామన్నారు. మల్కాజిగిరి, నేరేడ్‌మెట్, అల్వాల్ పోలీస్ స్టేషన్లను మరింత అభివృద్ధిపరుస్తామన్నారు. అసాంఘిక శక్తుల ఆటలు సాగనివ్వమని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. సొంత స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రూ. 5 లక్షలు, ఇండ్లు లేనివారికి డబుల్ బెడ్రూం, రూ.400లకు గ్యాస్ సిలిండర్, సన్న బియ్యం అందజేస్తామన్నారు. ప్రజలకు పూర్తి రక్షణ భరోసా కోసం బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు. కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్ రెడ్డి, సబితాకిశోర్, అనిల్‌కిశోర్, నాయకులు చింతల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని చూసి ఓటేయండి

**జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**



మిథిలానగర్ కాలనీ వాసులను బీఆర్ఎస్‌కు ఓటు
వేయాలని అభ్యర్థిస్తున్న మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

బంజారాహిల్స్, నవంబర్ 19: హైదరాబాద్ నగరంలో గత తొమ్మిదిన్నరేండ్లలో కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి విద్యావంతులు బీఆర్ఎస్ పార్టీకి ఓటేయాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతు కోరేందుకు ఆదివారం బంజారాహిల్స్ రోడ్ నం .12లోని మిథిలానగర్ కాలనీ వాసులతో మేయర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. నగరంలో జరిగిన అభివృద్ధి కళ్ల ముందే కనిపిస్తోందని, పారిశ్రామికరంగంతో పాటు ఐటీ రంగంలో ప్రభుత్వం ఇచ్చిన ప్రోత్సాహంతో అనేక ప్రపంచ ప్రసిద్ధి చెందిన సంస్థలు పెట్టుబడులు పెట్టాయన్నారు. అనంతరం బంజారాహిల్స్ రోడ్ నం.12లోని అమృత వ్యాలీ అపార్ట్‌మెంట్ నివాసితులతో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌తో పాటు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సమావేశమయ్యారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు వేలకోట్లతో అనేక ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు నిర్మాణం చేయడంతో పాటు మెట్రోరైల్ విస్తరణకు ప్రణాళికలు రూపొందించామన్నారు.

## కాలనీలు, బస్తీలను అభివృద్ధి చేశా

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్**



లాలాగూడలో ప్రచారం చేస్తున్న డిప్యూటీ
స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, నవంబర్19: నియోజకవర్గంలో కాలనీలు, బస్తీలు అనే తేడా లేకుండా అభివృద్ధి చేశానని, అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ సికింద్రాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. ఆదివారం అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని లాలాగూడలోని కట్టెలమండిలో స్థానిక కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మితో కలిసి ప్రచారం చేశారు. ప్రచారంలో పద్మారావు గడప గడపకు వెళ్లి తాను నియోజకవర్గంలో 10ఏళ్లుగా చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ... గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఇవ్వని హామీలను కూడా నెరవేర్చామని గుర్తు చేశారు. తనకు మరోసారి అవకాశం కల్పించాలని ఓటర్లను ఓటు అభ్యర్థించారు. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. సికింద్రాబాద్‌లో విజయం తమదేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.